ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 21.8
ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి
5
బుధవారం 13 నవంబరు 2024



యాదగిరీశుడికి

లక్ష పుష్పార్చన

- శాస్త్రోక్తంగా నిత్యపూజలు
- వివిధ విభాగాల ద్వారా రూ.28.75లక్షల ఆదాయం

6



బీజేపీ మూసీ బస

- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా క్షేత్రస్థాయికి
- 15న లేదా 16న పరివాహక ప్రాంతాల్లో పర్యటించేందుకు సన్నాహాలు
- ఏర్పాట్లు చేస్తున్న బీజేపీ నేతలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవంపై రాజకీయ రగడ కొనసాగుతోంది. మూసీ పునరుజ్జీవంపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల జోరు కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బస చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలో పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై విమర్శలు గుప్పించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 15 లేదా 16వ తేదీన బీజేపీ మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బసకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

మూసీ పునరుజ్జీవం జరిగి తీరుతుందని, రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ ప్రజల ప్రయోజనాల కోసం మూసీ ప్రక్షాళనకు పూనుకున్నామని ఇటీవల వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద నిర్వహించిన మూసీ పునరుజ్జీవ సంకల్ప పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టును అడ్డుకుంటే బుల్డోజర్లు ఎక్కించి ప్రక్షాళిస్తామని సీఎం పరోక్షంగా ప్రతిపక్షాలను హెచ్చరించారు. మూసీ అడ్డుకుంటే కుక్కచావు తప్పదని కేసీఆర్‌పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ పాదయాత్ర ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని, తన వెంట నడుస్తాన్న హరీష్, కేటీఆర్‌కు సవాల్ విసురుతున్నానని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే తేదీ చెప్పండి... తాను రెడీ అని సీఎం చాలెంజ్ చేశారు. సీఎం వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. మూసీ ప్రక్షాళన చేయని పక్షంలో తన జన్మ దండగని సీఎం పేర్కొనగా, కేవలం కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. బీజేపీ సైతం మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వం విమర్శల దాడిచేస్తోంది. మొత్తానికి మూసీ నది ప్రక్షాళన రాజకీయాలకు వేదికగా మారింది. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బస చేయాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి ...

- మిగతా 6వ పేజీలో...



రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. దీంతో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతమయ్యాయి.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

కొనుగోళ్లు వేగంగా..

- అలసత్వం వహించే అధికారులపై చర్యలు
- ఇప్పటివరకు 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- ఈ నెలాఖరులోగా 2లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం
- పలు ప్రాంతాల్లో ఇప్పటికే వ్యాపారులకు ధాన్యం విక్రయించిన రైతులు

జిల్లాలో పలు ప్రాంతాల్లో ధాన్యం సేకరణ జాప్యం అవుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు 15 రోజుల క్రితం తెచ్చిన ధాన్యాన్ని కనీసం తేమ శాతం చూడటం లేదని, కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. తాజాగా, చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాన్ని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ నేత కే.లక్ష్మణ్ సందర్శించి ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని ఎత్తిచూపారు. అంతేగాక అక్కడి నుంచే కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచారు.

4లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం

ప్రస్తుతం జిల్లాలో 280 కొనుగోలు కేంద్రాల్లో 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. రైతులు విక్రయించిన ధాన్యానికి ఇప్పటివరకు రూ.30కోట్లు చెల్లించారు. ఈ నెలాఖరులోగా మరో 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. జిల్లాలో మొత్తం 2.73లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 6.16లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని వ్యవసాయశాఖ అంచనా



వేసింది. ఏ-గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300గా ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ధాన్యం కొనుగోలుకు సుమారు 10లక్షల గన్నీ బ్యాగులు అవసరమని అధికారులు అంచనా వేయగా, ప్రస్తుతం జిల్లాలో మొత్తం 5,79,542 వరకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొత్తవి 4,21,703, పాతవి 1,57,839 గన్నీ బ్యాగులు ఉన్నాయి. మరో 94,20,458వరకు గన్నీ బ్యాగులు అవసరం. కొనుగోళ్లను బట్టి అధికారులు గన్నీ బ్యాగులను పంపిణీ చేయనున్నారు. ఇదిలా ఉండగా, ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్ హనుమంతరావుతో పాటు అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా, మండలస్థాయి అధికారు లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహించిన పలువురు అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. బొమ్మలరామారం పీఏసీఎస్ సీఈవోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు.

ఇప్పటికే వ్యాపారులకు విక్రయించిన రైతులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవడం ఆలస్యం కావడంతో రైతులు వ్యాపారులను ఆశ్రయించారు. మోత్కురు, అడ్డగూడూరు, ఆత్మకూరు, గుండాల, తదితర మండలాల్లో మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన కేంద్రాలు ప్రారంభంకాకపోవడంతో రైతులు వ్యాపారులను ఆశ్రయించారు. వ్యాపారులు రైతుల పంటపొలాల వద్దే కొనుగోలు చేస్తున్నారు. వర్ష భయంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోయకుండా నేరుగా వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. భువనగిరి గంజ్‌తో పాటు పలు మండలాల్లోని వ్యాపారులు రైతుల వద్ద మద్దతు ధర కంటే...

- మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మనోహర్



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్

భువనగిరి(కలెక్టరేట్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి):పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలు,వ్యాధులను గుర్తిస్తూ చికిత్స అందించడమే లక్ష్యంగా రాష్ట్రీయ్ బాల్ స్వాస్థ్య కార్యక్రమం పని చేస్తోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.మనోహర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్‌బీఎస్‌కెమెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలకు ఆయన రాష్ట్రీయ్ బాల్ స్వాస్థ్య కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సాయిశోభ, పీవోడీటీ వీణ, ప్రోగ్రాం ఇన్‌చార్జి చింతమల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ముందుంచాలి

టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో మునుగోడును రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంచాలని టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని బీమిడి మోహన్‌రెడ్డి భవన్‌లో మంగళవారం మునుగోడు నియోజకవర్గ టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీలో సభ్యత్వాన్ని పొందడం గౌరవప్రదంగా ఉంటుందన్నారు. పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్న వ్యక్తులకు రూ.5లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తనకు టీటీడీ బోర్డు మెంబరుగా అవకాశం కల్పించడమే అందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంట్ అధ్యక్షుడు కె.కృష్ణాచారి, మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య, నాయకులు ముత్యాల సాపిరెడ్డి,సంకరి జంగయ్య, వర్కాల వెంకటేశం, నల్ల పర్వతాలు, అశోక్, గుమ్మడి అంజిరెడ్డి, యాట వెంకటేశం, పాశం రఘుపతి, రాజు పాల్గొన్నారు.

మిల్లర్లు ఇబ్బందులు పెడితే ఊరుకోం

కలెక్టర్ హనుమంతరావు



జైకేసారంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణాతోపాటు దిగుమతిలో మిల్లర్లు ఇబ్బంది పెడితే సహించేది లేదని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. చౌటుప్పల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ధరణి సమస్యలపై సమీక్షించారు. సెరీకల్చర్ సెంటర్‌లో పట్టుదారం తీసే యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టే మిల్లర్ల ఏజెన్సీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. జిల్లాలో దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు 320, సన్న రకం ధాన్యం కొనుగోలుకు 43 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్ల కొరత లేదని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయించామని, పొలం నుంచి నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించడంతో తేమశాతం ఎక్కువగా ఉంటుందని, ఈ విషయాన్ని రైతులు గమనించి ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వేకోసం జిల్లాలో 2.65లక్షల ఇళ్లను గుర్తించామని, అందులో 60వేల ఇళ్లలో సర్వే పూర్తయిందన్నారు. సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, సర్వేకోసం ఎన్యూమరేటర్లు అడిగిన వాటికి వివరాలు ఇచ్చి సహకరించాలన్నారు. డివిజన్ పరిధిలో వివిధ రకాలకు చెందిన 261 ధరణి సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని, భూములను స్వాధీనం చేసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో యాకబ్ నాయక్, మునిసిపల్ కమిషనర్ కె.నర్సింహారెడ్డి, ఏవో నాగరాజు, ఆర్‌ఐ లు బి.రాంరెడ్డి, కె.సుధాకర్ రావు, సెరీకల్చర్ సెంటర్ నిర్వాహకుడు గంజి శ్రీహహ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కుటుంబ సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు ఎన్యూమరేటర్లను ఆదేశించారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలో మంగళవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్: ఇటీవల జరిగిన బాలసదనం ఘటనపై కలెక్టర్ తీసుకున్న చర్యలకు బాలల హక్కుల పరిరక్షణ వేదిక తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆ వేదిక నాయకుడు కొడారి వెంకటేశ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాలల హక్కులను కాపాడడానికి ప్రతీఒక్కరు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి :కలెక్టర్ హనుమంత రావు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మంగళవారం మండల పరిధిలోని జైకేసారంలో ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి రైతులతో మాట్లాడారు.

'పది' ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలపాలి

భువనగిరి టౌన్: మార్చి 2025లో జరిగే పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన జిల్లాలోని ఎంఈవోలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మోడల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షలకోసం విద్యార్థులను ఇప్పటినుంచే సన్నద్ధం చేయాలని, క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలన్నారు. ఇందు కోసం జిల్లా విద్యా శాఖ ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలన్నారు. అలాగే ఒకటో తరగతి నుంచే విద్యార్థులపై శ్రద్ధ చూపాలని, నాణ్యమైన విద్యా బోధన అందిస్తూ పకడ్బందీగా తరగతులు నిర్వహించాలన్నారు. డీఈవో కె.సత్యనారాయణ మాట్లాడుతూ డిసెంబరు 4న నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి నివారణపై ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరాజయ్య అవగాహన కల్పించారు. సమావేశంలో విద్యా శాఖ ఏడీ ఎన్ ప్రశాంత్‌రెడ్డి, డీసీ ఈబీ కార్యదర్శి పాండునాయక్, సహాయ పరీక్షల కమిషనర్ కె.రఘుమారెడ్డి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, పి.లింగారెడ్డి, శ్రీహరి అయ్యంగార్, రాధ, నరహరి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో వైఫల్యం

- అధికారం, నిధుల దుర్వినియోగం
- చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గంపై వేటు
- పర్సన్ ఇన్‌చార్జిగా సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు బాధ్యతలు

భువనగిరి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గంపై ప్రభుత్వం వేటువేసింది. సొసైటీ నిర్వహణ, నిధుల దుర్వినియోగం, పాలన వ్యవహారాల్లో వైఫల్యం కారణంగా మొత్తం పాలకవర్గాన్ని రద్దుచేస్తూ రాష్ట్ర సహకార సంఘాల సంచాలకులు, కోఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ పి.ఉదయ్‌కుమార్ ఈ నెల 11వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, మరో 11మంది డైరెక్టర్లను పదవుల నుంచి తొలగించారు. సొసైటీ పరిపాలన వ్యవహారాల నిర్వహణ బాధ్యతను సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కంచర్ల వెంకట్‌రెడ్డికి అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు. చందుపట్ల సొసైటీలో అధికార దుర్వినియోగం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై రాష్ట్ర కోఆపరేటివ్ సంచాలకులు, సొసైటీ రిజిస్ట్రార్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. పాలకవర్గంపై వచ్చిన అభియోగాలపై విచారణ జరపగా, సొసైటీ పాలకవర్గం తమ విధులు నిబంధనల ప్రకారం నిర్వహించడంలో విఫలమైనట్లు తేలింది. చందుపట్ల సొసైటీ కార్యాలయ విస్తరణ నిర్మాణ పనులు, సొసైటీ పరిధిలోని బండ సోమారం గోదాం నిర్మాణం, చందుపట్ల శివారులో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు వంటి విధానపరమైన పనులకు నిబంధనల ప్రకారం సొసైటీ జనరల్‌బాడీ ఆమోదం లేకుండా చేపట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లుగా విచారణ అధికారి నివేదిక అందజేశారు. దీంతో సొసైటీ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి మరో 11 మంది డైరెక్టర్లను పదవుల నుంచి తొలగించారు. సొసైటీ పాలకవర్గ నిర్వహణ బాధ్యతలను తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకూ యాదాద్రి భువనగిరి జిల్లా సహకార సహాయ ఆడిటింగ్ అధికారి కంచర్ల వెంకట్‌రెడ్డికి అప్పగించారు. ఈమేరకు ఆయన మంగళవారం చందుపట్ల సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో దంతూరి నర్సింహాగౌడ్, డీసీవో కార్యాలయ సూపరింటెండెంట్ అశోక్, నల్లమాస రాములు, సిబ్బంది పాల్గొన్నారు.



చందుపట్ల సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుంటున్న వెంకట్‌రెడ్డి

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

- ఈ నెల 15 నుంచి డిసెంబరు 5 వరకు ఇంటింటికీ సీపీఎం
- జిల్లా కార్యదర్శి జహంగీర్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమస్యల పరిష్కారమే ఎజెండాగా, అభివృద్ధి లక్ష్యంగా ఉద్యమాలు చేపట్టేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మంగళవారం భువనగిరిలో జరిగిన పార్టీ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా జిల్లా ప్రజల కష్టాలు తీరడం లేదన్నారు. దశాబ్దాల క్రితం ప్రతిపాదించిన సాగునీటి కాల్వలు, చిన్ననీటి ప్రాజెక్టులు నేటికీ పూర్తి కాలేదని జిల్లా వాసులకు నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదన్నారు. చేతి ఉత్పత్తిదారులు, వ్యవసాయ కూలీలు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధికి చేస్తున్నదేమీ లేదన్నారు.

ఈ మేరకు నవంబరు 15 నుంచి డిసెంబరు 5 వరకు జిల్లా ఇంటింటికి సీపీఎం చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలన్నారు. సమావేశంలో నాయకులు కొండమడుగు నర్సింహ, భట్టుపల్లి అనురాధ, మంగ నర్సింహులు, మాటూరి బాలరాజు, దోనూరి నర్సిరెడ్డి, కల్లూరి మల్లేశం, దాసరి పాండు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడి అమానుషం

నల్ల బ్యాడ్జీలతో కలెక్టరేట్ ఉద్యోగుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్‌తోపాటు రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడి అమానుషమని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా అధ్యక్షుడు సి.జగన్‌మోహన్‌ప్రసాద్ అన్నారు. ఈ నెల 11న జరిగిన వికారాబాద్ ఘటన నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా మెజిస్ట్రేట్‌పై దాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కెశ్రీకాంత్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రామారావు, సైదులు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కొంగర సామ్యూల్, జిల్లా బీసీ సంక్షేమాధికారి యాదయ్య,అసిస్టెంట్ ట్రెజరీ అధికారి మోహన్‌కుమార్,ఐసీడీఎస్ సూపరింటెండెంట్ సోమేష్,కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మోత్కూరు, యాదగిరిగుట్ట రూరల్: వికారాబాద్ జిల్లా కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 11న కలెక్టర్, తహసీల్దార్, ఇతర రెవెన్యూ సిబ్బంది కొందరు వ్యక్తుల దాడి హేయమైన చర్య అని మోత్కూరు రెవెన్యూ ఉద్యోగులు ఖండించారు.

మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఎం.ఉపేందర్, ఆర్‌ఐ డి.శ్రీనివాస్, ఎస్ఏ ఇంద్రకుమార్, ప్రభుదాసు, సర్వేయర్ ఖాజా ఫారోద్దీన్, దాసరి వీరన్న, బుంగ చరణ్ రాజ్, ఈదుల బాలస్వామి, చిత్తలూరి స్వామి తదితరులు పాల్గొన్నారు. యాదగిరిగుట్టలోనూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ దేశ్యానాయక్, డిప్యూటీ తహసీల్దార్ నరసింహారావు ఆధ్వర్యంలో నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

భవిష్యత్ తరాలకోసం ఉద్యమించాలి

ఆత్మకూరు(ఎం), 12 నవంబరు (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు భరోసా కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో విద్యార్థులు ఉద్యమించాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఫౌండర్ కె.లక్ష్మారెడ్డి, వందేమాతరం ఫౌండర్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు పర్యావరణ విద్య పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనందరికీ ఆధారమైన ప్రకృతిని కాలుష్యం నుంచి కాపాడాలన్నారు. కార్యక్రమంలో యెల్లంల సంజీవరెడ్డి, యాస లక్ష్మారెడ్డి, గంధమల్ల జహంగీర్, తాజా మాజీ సర్పంచ్ జె.నగేష్, ఇన్‌చార్జి హెచ్‌ఎం మక్బూద్‌అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం లక్ష పుష్పార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పాలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన పూజలు చేశారు. పాంచరాత్రాగమ రీతిలో గంట పాటు పూజాపర్వాలు కొనసాగాయి.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

స్వామివారి దివ్యక్షేత్రంలో మంగళవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనార్చనలు చేశారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,75,384 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి దివ్యవిమాన రాజగోపురానికి హైదరాబాద్‌కు చెందిన రాగల శివకాంత్‌కుమార్, శ్రీనివాస్ రూ.5లక్షల చెక్కును అందజేశారు.

మార్మోగుతున్న శరణుఘోష

● పల్లెలు, పట్టణాల్లో మొదలైన పడిపూజలు

● మకర జ్యోతి వరకు కొనసాగనున్న అయ్యప్పపూజలు

హుజూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాల అంటే ఒక పవిత్రమైన కార్యం. కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అయ్యప్పస్వామి మాలధారణలు మొదలయ్యాయి. అక్టోబరు నుంచి జనవరి 17న మకరవిళక్కు వరకు మాలధారణలో ఉన్న భక్తులు నిత్యం అయ్యప్ప స్వామి పూజల్లో నిమగ్నమవుతుంటారు. ఆయా పూజలతో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరుస్తుంది. ముఖ్యంగా హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, మిర్యాలగూడ, భువనగిరి, యాదగిరిగుట్ట, నల్లగొండ పట్టణ ప్రాంతాల్లోని అయ్యప్పస్వామి దేవాలయాల్లో నిత్యం శరణఘోషలు మార్మోగుతుంటాయి. ప్రత్యేకంగా పూజామండపాలు ఏర్పాటుచేసుకుని అయ్యప్ప నామస్మరణ చేస్తుంటారు. మండల దీక్షలు చేసిన అనంతరం మాలధారులు కేరళ రాష్ట్రంలోని శబరిమలలోని అయ్యప్పస్వామి దేవాలయానికి వెళ్లి ఇరుముడి సమర్పిస్తారు. దురలవాట్లకు దూరంగా ఆధ్యాత్మికతకు దగ్గరగా నిత్యం ఆ స్వామిని స్మరిస్తూ పార్వతీపరమేశ్వర్లు, సుబ్రహ్మణ, గణపతి, లక్ష్మీదేవి, సరస్వతి మాతలను పూజిస్తుంటారు. ఉదయం పానీయం, మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం అల్పాహారం చేస్తుంటారు. 41 రోజుల మాల ధరించిన సమయంలో పడిపూజలకు హాజరవుతుంటారు. శబరిమలలోని అయ్యప్పస్వామి దేవాలయం మాదిరి 18 మెట్లు ఏర్పాటు చేసి స్వామికి ప్రత్యేక అర్చనలు, పూజలు చేస్తారు. దీనినే పడిపూజ అంటారు. ఎక్కడ ఉన్న స్వాములైనా పడిపూజకు తప్పక హాజరవుతుంటారు. శబరివాసుడి కీర్తనలతో సుమారు రెండు, మూడు గంటల పాటు జరిగే పూజతో ఆ ప్రాంతం ఆధ్యాత్మికలో మునిగిపోతుంటుంది.





పడిపూజలో 18 మెట్లపూజ



పడిపూసం కోసం ప్రత్యేకంగా అలంకరించే మండపం



భజనల్లో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

ఆశయాలకు వయస్సు అడ్డంకి కాదు

● ఉద్యోగ విరమణ పొందినా సేవలు కొనసాగిస్తున్న పలువురు ఉపాధ్యాయులు

● విశ్రాంతి లేకుండా సేవల్లోనే...

సాధించాలనే తపనకు ఆరు పదుల వయస్సు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు సమాజ సేవలో పాలుపంచుకుంటున్నారు. పదవీ విరమణ ఉద్యోగ బాధ్యతలకే కానీ తమ ఆశయాలకు కాదంటున్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. సమాజ సేవలో ఆనందం ఉంటుందని పేర్కొంటున్నారు.

మోత్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏదైనా చేయాలన్న తపనతో సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్నారు యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సూరోజు భాస్కరాచారి, రిటైర్డ్ సీడీపీవో యాదమ్మ దంపతులు. భాస్కరాచారి 2013లో, యాదమ్మ 2020లో ఉద్యోగ విరమణ పొందారు. భాస్కరాచారి రిటైర్ కాక ముందునుంచే సామాజిక



భాస్కరాచారి దంపతులను సన్మానిస్తున్న వేణుగోపాలచారి

సేవా కార్యక్రమాలు చేసేవారు. రిటైర్ అయ్యాక పూర్తి సమయాన్ని అందుకే వెచ్చిస్తున్నారు. అందుకు సతీమణి అండగా నిలిచింది. 12ఏళ్లుగా బుజిలాపురం, దాచారం పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు 100 శాతం ఫలితాలు సాధించేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి యేటా గురుపూజోత్సవం నిర్వహించి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నారు. ఐదారేళ్లుగా మోత్కూరులో వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి వినాయక చవితి సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీలో భాగస్వామి అవుతున్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తూ ఆయన విద్యార్థులకు చెకుముఖి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నారు. సామాజిక సేవలకు కలెక్టర్ అనితారామచంద్రన్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి నుంచి పలు అవార్డులు అందుకున్నారు.

సామాజిక సేవ చేయాలి

ఉద్యోగస్తులు రిటైర్ కాగానే వయస్సు అయిపోయిందని భావించొద్దు. ఆరోగ్యం సహకరించినంత కాలం సామాజి సేవలో పాల్గొనాలి. సామాజిక సేవా కార్యక్రమాలు చాలా తృప్తినిస్తాయి. ఇంటికి పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుంది.



● సూరోజు భాస్కరాచారి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

● ఉత్సాహంతో సమాజ సేవ



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం

దేవరకొండ : నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన అంకం చంద్రమౌళి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడుగా 2012లో పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సులో ఇంట్లో కాలక్షేపం చేయకుండా రిటైర్డ్ ఉద్యోగుల సేవ సంఘం కార్యదర్శిగా పనిచేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉన్నారు. పద్మశాలీ అఫిషియల్, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా లయన్స్‌క్లబ్ మిత్ర అధ్యక్షుడిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దేవరకొండలోని నిరుపేదలను, వృద్ధులను గుర్తించి వారికి నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. కరోనా సమయంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలువురికి భోజనాలు, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. స్థానిక మార్కండేయస్వామి దేవాలయం ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నారు. 2024లో బహుజన సమాజ సాంస్కృతిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో చంద్రమౌళికి జాతీయస్థాయి అవార్డును అందజేశారు.

పేదలకు సేవే లక్ష్యంగా ముందుకు




పేదలకు సేవ చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నా. ప్రధానోపాధ్యాయుడుగా పదవీవిరమణ పొందినా తోటి ఉపాధ్యాయ మిత్రులు, సంఘం సభ్యులతో కలిసి విలాసంగా గడుపుతున్నాం. రిటైర్డ్ ఉద్యోగ సంఘం సమస్యలపై పోరాడుతున్నాం. పేదలకు, నిరుపేదలకు సేవ చేయడంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలన్నదే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం.

అంకం చంద్రమౌళి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి

● పనిచేసిన పాఠశాలకు సేవలు

సంస్థాన్ నారాయణపురం : ప్రతీ ఉద్యోగికి రిటైర్మెంట్ తర్వాత జీవితమంతా కుటుంబ సభ్యులతో సరదాగా గడపాలని కోరుకుంటారు. కానీ కొంతమంది మాత్రం విశ్రాంతి అనేది వయసుకే కానీ మనసుకు కాదని ఇతరత్రా పనుల్లో పాలుపంచుకుంటారు. అలాంటి కోవకు చెందిన వారిలో యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రానికి చెందిన ఒకరు బాలగోని యాదయ్య. యాదయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడి, ప్రధానోపాధ్యాయుడిగా 28 ఏళ్లుగా వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేశారు. ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ చేశారు. రిటైర్డ్ అయినప్పటికీ ఖాళీగా ఇంట్లో ఉండడం ఇష్టం లేక సమాజానికి తమవంతు ఏదైనా చేయాలనుకున్నాడు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్నాడు. గతంలో తాను అదే పాఠశాలలో పనిచేయడం, ఆ ప్రేమతో రోజూ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాడు. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు స్వచ్ఛందంగా పాఠాలు బోధిస్తున్నారు. రిటైర్డ్ అయ్యాక విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు యాదయ్యను పలువురు అభినందిస్తున్నారు.

విద్యపై ఉన్న మమకారంతో



ఖాళీగా ఉండడం ఇష్టం లేక విద్యార్థులకు స్వచ్ఛందంగా పాఠాలు బోధిస్తున్నా. నేను కూడా అదే పాఠశాలలో చదువుకున్నా. ఉద్యోగం వచ్చాక అక్కడే విద్యాబోధన చేశా. అందువల్లే ఆ పాఠశాలపై మమకారం ఎక్కువ. రిటైర్మెంట్ తర్వాత ఖాళీగా ఉంటే బదులు సమాజానికి ఉపయోగపడేలా ఏదో ఒకటి చేయాలి. తనకు పాఠశాలలో విద్యార్థులకు చదువు చెప్పే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

● బాలగోని యాదయ్య, రిటైర్డ్ టీచర్

బీజేపీ మూసీ బస

(5పేజీ తరువాయి)

జి.కిషన్‌రెడ్డితోపాటు సీనియర్ నేతలు, జిల్లా నేతలతో కలిసి మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, బస చేసేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోంది.

సీఎం సవాల్ నేపథ్యంలో

ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌లో గంగా, సబర్మతి నదులను రూ.40వేల కోట్లతో సుందరీకరణ చేస్తుంటే బీజేపీ నేతలు మెచ్చుకున్నారని, తాను తెలంగాణ సీఎం మూసీ పునరుజ్జీవం చేయొద్దా అని వలిగొండ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీని అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఉంటే స్థానిక పరిస్థితులు అవగతమవుతాయని సీఎం వ్యాఖ్యానించారు. ఆయన సవాల్‌ను బీజేపీ స్వీకరిస్తూ, మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకుని, రాత్రి వేళ బస చేయాలని నిర్ణయించింది. మూసీ పరివాహక ప్రాంతాలైన భువనగిరి, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మండలాల పరిధిలో ఎవరెవరు ఏ ప్రాంతాల్లో పర్యటించాలనే తేదీలను త్వరలో ఖరారు చేసే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో సభలు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమావేశాల వేదికగా కేంద్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించే ప్రయత్నాన్ని బీజేపీ నేతలు చేయనున్నారు. ఒక నాడు తాగు నీటిని అందించిన మూసీ ప్రస్తుతం మురికి కూపంగా మారడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రజలకు వివరిస్తూ ఈ ప్రాంత కులవృత్తిదారులతో సంభాషించనున్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పాదయాత్రలు

బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల నుంచి వచ్చిన మద్దతుతో స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ డిసెంబరు 1వ తేదీ నుంచి క్షేత్రస్థాయికి వెళ్లాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్రలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు రానున్న ఎన్నికలే లక్ష్యంగా ప్రచారాన్ని చేపట్టనుంది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీలపై ఈ పాదయాత్ర ద్వారా ఎండగట్టనుంది. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు యాత్ర చేపట్టనుంది. జిల్లాలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి. ప్రతీ నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయి నేతను ఇన్‌చార్జీగా నియమించి, స్థానిక నేతలతో కలిసి ఈ యాత్రలు చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లాల వారీగా త్వరలో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల వారీగా రూట్ మ్యాప్‌లను ఖరారు చేయనున్నారు. అందుకోసం స్థానిక నేతల నుంచి యాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు తీసుకోనున్నారు.

తైక్వాండోలో బంగారు పతకం



బంగారు పతకంతో జునేరాఖుల్సామ్ (మధ్యలో)

మిర్యాలగూడటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఆర్ డీజీ పాఠశాల 6వ తరగతి విద్యార్థిని జునేరా ఖుల్సామ్ తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించారు. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన అండర్-14 నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచినట్లు కోచ్ యూనిస్ మాలిక్ తెలిపారు. జునేరాఖుల్సామ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో సాధిక్‌అలీ, ఫర్హానాబేగం తదితరులు పాల్గొన్నారు.

కామినేని దంత వైద్య కళాశాలకు

ప్రత్యేక గుర్తింపు అవార్డు

● ఢిల్లీలో ప్రధానం చేసిన కేంద్ర ఆరోగ్యశాఖాధికారులు



కేంద్ర ఆరోగ్యశాఖ అధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న మహేష్

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని కామినేని దంత వైద్య, విద్యా కళాశాలకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ నుంచి అరుదైన గుర్తింపు లభించింది. జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో కామినేని కళాశాల యాజమాన్యం గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు, ర్యాలీలు, దంత ఆరోగ్యంపై అవగాహన సదస్సులను నిర్వహించినందుకు 2024 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక గుర్తింపు అవార్డుకు ఎంపిక చేసింది. మంగళవారం న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్.స్వస్తి చరణ్, డైరెక్టర్ ఈఎంఆర్, హెల్త్ సర్వీసుల విభాగం డీజీ డాక్టర్ అతుల్ గోయల్ నుంచి కళాశాల ప్రిన్సిపాల్ పీ మహేష్ అవార్డును అందుకున్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలి





డిండిలో బాలికల విభాగంలో కబడ్డీ పోటీలు, రాజాపేటలో బాలుర విభాగంలో పోటీ

డిండి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జోనల్ అధికారి విద్యారాణి అన్నారు. డిండి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్న 10వ జోనల్ స్థాయి క్రీడాపోటీలను మంగళవారం ఆమె సందర్శించి, మాట్లాడారు. క్రీడాకారులను పరిచయం చేసుకునేని కొద్దిసేపు ఆడి వారిలో ఉత్సాహం నింపారు. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన ఫొటోగ్యాలరీని సందర్శించారు.

క్యారమ్స్ విభాగంలో

అండర్-14 ఇమాంపేట గురుకుల పాఠశాల ప్రథమస్థానం, కట్టంగూరు ద్వితీయ స్థానం

అండర్-17 విభాగంలో జీవీగూడ ప్రథమ స్థానం, డిండి ద్వితీయస్థానం

అండర్-19 విభాగంలో డిండి ప్రథమ స్థానం, ఇమాంపేట ద్వితీయస్థానం

100 మీటర్ల పరుగుపందెంలో

అండర్-14 విభాగంలో వై.దీపిక జీవిగూడ ప్రథమ, మేఘన మఠంపల్లి ద్వితీయస్థానం.

చెస్ పోటీల్లో

అండర్-14 విభాగంలో జీవిగూడ మొదటి స్థానం, నకిరేకల్ ద్వితీయస్థానం,

అండర్-17 విభాగంలో ఇమాంపేట మొదటి స్థానం, మఠంపల్లి ద్వితీయస్థానం,

అండర్-19 విభాగంలో జీవిగూడ మొదటి స్థానం, డిండి ద్వితీయస్థానం

షాట్‌పుట్ విభాగంలో

అండర్-14 విభాగంలో కట్టంగూరు మొదటి స్థానం, డిండి ద్వితీయస్థానం.

రాజాపేటలో 10వ జోనల్ స్థాయి

రాజాపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో 10వ జోనల్ స్థాయి పోటీలు మంగళవారం రెండవరోజు కొనసాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, చెస్ అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు ప్రతిభను చాటారు. క్రీడల నిర్వహణను జోనల్ అధికారి విద్యారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్, డీసీవో జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రాజు, వివిధ పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విజేతలు వీరే

10వ జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలో విజేతలను మంగళవారం ప్రిన్సిపాల్ సుధాకర్, జోనల్ అధికారి విద్యారాణి, డీసీవో జగదీశ్వర్ రెడ్డి ప్రకటించారు.

200మీటర్లలో

అండర్-14 విభాగంలో మహేష్ ప్రథమ, (స్టేషన్‌ఘణ్‌పూర్), ఎం చైతన్య ద్వితీయ(చండూరు)

లంగ్‌జంప్‌లో

ఎం మహేష్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), కే అరవింద్ ద్వితీయ(స్టేషన్‌ఘణ్‌పూర్)

అండర్-17 విభాగంలో ఆర్ ప్రణయ్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), ప్రవీణ్ ద్వితీయ(హుజూర్‌నగర్)

500 మీటర్ల దూరంలో

అండర్-17 విభాగంలో ఎస్ శివ ప్రథమ(తిప్పర్తి), అభినేవ్‌కుమార్ ద్వితీయ(భువనగిరి)

అండర్-19 విభాగంలో గోపిచంద్ ప్రథమ (మిర్యాలగూడ), సీహెచ్ ప్రవీణ్ ద్వితీయ(స్టేషన్ ఘణ్‌పూర్)

డిస్కస్‌త్రో విభాగంలో

అండర్-19 ఎ శంకర్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), ప్రవీణ్ ద్వితీయ (జనగామ),

లాంగ్‌జంప్‌లో

కార్తీక్‌రాజు ప్రథమ(మునగాల), అజయ్‌కుమార్ ద్వితీయ (భువనగిరి) విజేతలుగా నిలిచారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

కనగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి చెస్‌పోటీలకు నల్లగొండ జిల్లా కనగల్ మోడల్ స్కూల్ ఇంటర్(బైపీసీ) మొదటి సంవత్సరం విద్యార్థిని అనూష ఎంపికైంది. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా తరఫున అనూష పాల్గొననుందని ప్రిన్సిపాల్ థామస్, పీడీ విజయ్ తెలిపారు. అనూషను ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు..

తిరుమలగిరి(సాగర్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన పిట్టల సంపత్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-19 కబడ్డీ విభాగంలో ప్రతిభ కనబరిచి డిసెంబరులో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం సంపత్ చింతపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంపత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు, గ్రామస్థులు, క్రీడాకారులు అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

మఠంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం విద్యార్థిని ఎన్ మల్లేశ్వరి ప్రతిభ కనబరిచింది. అండర్-17విభాగంలో వర్దాపురం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని మల్లేశ్వరి ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు తరుపున పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు వీరస్వామి తెలిపారు. మల్లేశ్వరిని ఉపాధ్యాయులు అభినందించారు.

నెట్‌బాల్ విభాగంలో సాగర్ విద్యార్థులు

నాగార్జునసాగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించగా, బాలుర జట్టు ద్వితీయస్థానం సాధించిందన్నారు.ప్రథమ స్థానం సాధించిన బాలికల్లో బీ.కీర్తన, ఎండీ సుభానూర్, జే సుప్తవిరాజ్, ఎస్‌కే రిజ్వానా, బీ కరుణ, పీ మహేశ్వరీ, ఆర్ సింధు, బీ పూజ, ఎస్‌కే మోహక్, జే దీక్షితలు ఉన్నారు. బాలుర జట్టులో వెంకటసాయి, పృథ్వీరాజ్, సాయి, నిఖిలేస్, మోహన్, స్వరూప్, నజీబ్, పవన్ కుమార్‌లు ఉన్నారు. విద్యార్థులను జిల్లా నెట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యార్థులు

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.125	190	220
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.10
టీఎంసీలు	305.5050
ఎడమకాల్వకు నీటి విడుదల	3,374
కుడికాల్వకు	10,200
విద్యుత్ కేంద్రం ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,852 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,374 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.27 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.89 అడుగులు
టీఎంసీలు	4.17
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	429.27 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	369.47 క్యూసెక్కులు

రోడ్డుపై ధాన్యం.. ప్రయాణాలకు ఆటంకం

జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోత ▸ ప్రమాదాల బారిన పడుతున్న వాహనాదారులు



భువనగిరి బైపాస్ సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

భువనగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబెడుతుండడంతో వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై ధాన్యం ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదాలు జరిగి వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. సర్వీసు రోడ్డుపై పదేళ్లుగా ధాన్యం ఆరబోస్తున్నారు. యాదాద్రిభువగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు వద్ద ప్రారంభమైన సర్వీసు రోడ్డు భువనగిరి మండలం, భువనగిరి అర్బన్, యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వరకు సుమారు 20 కిలోమీటర్ల ఉంటుంది. ఈ రోడ్డుపై సుమారు పది సంవత్సరాలుగా ధాన్యం ఆరబెడుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో యాదగిరిగుట్ట, భువనగిరి, బీబీనగర్ మండలాల చెందిన 18 మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో గాయపడ్డారు. హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారి భువనగిరి శివారులోని రాయిగిరి సర్వీస్ రోడ్డు, నల్లగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డు వద్ద రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు. తమకు అనుకూలంగా కల్లాలు లేకపోవడంతోనే గత్యంతరం లేక జాతీయ రహదారికి సంబంధించిన సర్వీస్ రోడ్లను వినియోగించుకుని ధాన్యం ఆరబోస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. భువనగిరి మండలానికి చెందిన ద్విచక్ర వాహనాదారుడు వెంకటేశ్ గమనించకుండా ధాన్యం రాశులపై ఉంచి వెళ్లి కిందపడి గాయపడ్డాడు. అదే విధంగా నిత్యం ఈ రహదారుల గుండా మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కాగా రాత్రి వేళల్లో ఆ ధాన్యం రాశులపై నల్లటి ప్లాస్టిక్ కవర్లు కప్పిఉంచడం, కుప్పలా పక్కన పెద్ద పెద్ద రాళ్లు పెట్టడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రైతులతో మాట్లాడి వాహనాదారులకు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

రైతులు ధాన్యాన్ని సర్వీస్ రోడ్లపై ఆరబోస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. పగిడిపల్లి, అనంతారం, భువనగిరి బాగాయత్, రాయిగిరి పరిధిలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయవద్దని చెప్పాం. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక పోలీసులు మా దృష్టికి తెచ్చారు. కౌన్సిలింగ్ ఇచ్చి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకుంటాం.

- సైదులు ఆర్అండ్‌బీ ఏఈ, భువనగిరి.

రహదారిపై ధాన్యం ఆరబోయడంతో..

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి నాగరాజు(25) దీపావళి పండుగ కోసం ఈ నెల 1వ తేదీన చివ్వెంల మండలం చందుపట్ల గ్రామానికి వెళ్లాడు. గురువారం రాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా వట్టిఖమ్మంపహాడ్ సమీపంలో రహదారిపై ఆరబోసిన ధాన్యం కుప్పల కారణంగా అదుపుతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు.

రహదారిపై ధాన్యం ఆరబెట్టడం నివారించాలి



రైతులకు అవగాహన కల్పించకపోవడంతో ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల వ్యవసాయ బావుల వద్ద క్లస్టర్ల వారీగా సరిపడా కల్లాలను ఏర్పాటు చేయాలి. రహదారిపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలి.

- కంచిమల్లయ్య, స్థానికుడు

వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

దేవరకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని తాటికోలు గ్రామ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా అవుతుందన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న డ్రైవర్ సోమ్లానాయక్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి



రోజా (ఫైల్)

చింతపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ధైర్యపురితండాలో మంగళవారం జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ధైర్యపురితండాకు చెందిన వాంకుడోత్ రోజా(25), హరి దంపతులు గ్రామంలో కిరాణ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే తండాకు చెందిన వాంకుడోత్ వెంకట్, శారద దంపతుల కుమారుడు కల్యాణ్ కిరాణ దుకాణానికి వచ్చి రోజాతో మాటలు కలిపి చనువుగా ఉండేవాడు. సెల్‌ఫోన్ ఇప్పించి ఆమెతో మాట్లాడేవాడు. అక్టోబరు 26వ తేదీన రాత్రి కల్యాణ్ రోజాకు ఫోన్ చేసి పెళ్లి చేసుకుంటానని చెప్పి వరంగల్‌కు తీసుకెళ్లాడు. రెండు రోజుల నుంచి రోజా కన్పించకపోవడంతో రోజా కుటుంబసభ్యులు కల్యాణ్ కుటుంబ సభ్యులను నిలదీశారు. తల్లిదండ్రులు కల్యాణ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. అక్టోబరు 28వ తేదీన కల్యాణ్ రోజాతో కలిసి తండాకు వచ్చాడు. హరి కుటుంబసభ్యులతో కలిసి రోజాను కాపురానికి తీసుకెళ్లాడు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ చిలికి చిలికి తారస్థాయి చేరింది. మనస్తాపం చెందిన రోజా అక్టోబరు 30వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. హరి తల్లిదండ్రులు వ్యవసాయ పనులు ముగించుకొని వచ్చేసరికి రోజా ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది. చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందింది. రోజా భర్త హరి ఫిర్యాదు మేరకు కల్యాణ్‌తో పాటు తల్లిదండ్రులు వాంకుడోత్ వెంకట్, శారద బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

11 రోజులు మృత్యువుతో పోరాడి..

భువనగిరి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన సిరికొండ అయిలయ్య(38) ఈ నెల 2న తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి అపస్మాకర స్థితిలో వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 11రోజులుగా మృత్యువుతో పోరాడి మంగళవారం మృతిచెందాడు. అయిలయ్య సోదరి చర్లపల్లి సత్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వారణాసి సంతోష్‌కుమార్ తెలిపారు. అయిలయ్య బోర్‌వెల్ వాహనంపై డ్రైవర్‌గా పని చేసేవాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ దేవరకొండ జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి పి. రవీందర్ మంగళవారం తీర్పు ఇచ్చారు. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం గుంటూరు జిల్లాలోని నరసరావుపేటకు చెందిన పాత నేరస్థుడు కత్తి రవికుమార్ నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గజ్జెల సుధాకర్‌రెడ్డి ఇంట్లో జనవరి నెలలో తులంన్నర బంగారం దొంగతనం చేశాడు. పెద్దవూర మండలం లింగంపల్లిలో బైక్ దొంగతనం చేశాడు. అతనిపై గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని చాకచక్యంగా పోలీసులు పట్టుకొని దేవరకొండ కోర్టులో హాజరపరిచారు. నిందితుడిని పట్టుకున్న గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, కోర్టు కానిస్టేబుల్ శేఖర్‌ను కొండమల్లేపల్లి సీఐ ధనంజయ్య అభినందించారు.

రైలుపట్టాలపై మృతదేహం లభ్యం

భువనగిరి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి - పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జే కృష్ణారావు తెలిపారు. సుమారు 30 ఏళ్ల వయస్సు ఉండి, శరీరంపై ఎర్రని డ్రాయర్ ఉందని తెలిపారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా, లేక నడుస్తున్న రైలు నుంచి జారి పడి మృతి చెందాడా తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచామని, ఆనవాళ్లు తెలిసిన వారు సెల్ నెంబర్లు 9848222169, 8712568454కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పశువులు తరలిస్తున్న వాహనాలు పట్టివేత

మునగాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కబేళాకు పశువులను తరలిస్తున్న వాహనాలను మంగళవారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా, కోదాడ నుంచి హైదరాబాద్‌కు పశువులను రెండు వాహనాల్లో తరలిస్తున్నారు. ఆయా వాహనాల్లో 17 పశువులను ఆంధ్రప్రదేశ్ జగ్గయ్యపేట నుంచి కబేళాకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ గొడ్ల బాబ్జీ తెలిపాడని, మరో డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఇరువురిపై కేసు నమోదు చేసి, గోవులను హైదరాబాద్ జీయాగూడ గోశాలకు తరలిస్తున్నట్లు ఎస్ఐ తలిపారు.

డీసీఎంలోని గడ్డి దగ్ధం

వలిగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎదుళ్లగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. రామన్నపేటకు చెందిన ఎర్ర నర్సింహ ప్రొద్దటూరు గ్రామంలోని గడ్డిని డీసీఎం వాహనంలో లోడ్ చేసుకొని స్వగ్రామానికి వెళ్తుండగా విద్యుత్‌వైర్లు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధమై మంటలు చేలరేగాయి. డ్రైవర్ ఫైర్‌సిబ్బంది సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పేశారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

హోటల్ క్వార్టర్స్‌లో మహిళ హత్య



ఝాన్సీ మృతదేహం

కేతేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హోటల్ సిబ్బంది నివాసించే క్వార్టర్స్‌లో మహిళ హత్యకు గురైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల శివారులో గల 'మా పల్లెరుచులు' హోటల్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు, హోటల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన గంగాధర ఝాన్సీ(22), నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని తెప్పలమడుగు గ్రామానికి చెందిన పెద్దమల్లు కోటేశ్వరరావు అలియాస్ బన్నీ 20రోజుల క్రితం హైవే వెంట గల మా పల్లెరుచులు హోటల్‌లో పనికి కుదిరారు. వీరు హోటల్‌లోనే తిని హోటల్‌కు వెనుక వైపు గల సిబ్బంది క్వార్టర్లలో నివసించేవారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి హోటల్‌లో విధులు ముగించుకుని క్వార్టర్‌కు వెళ్లిన ఝాన్సీ బన్నీ మంగళవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో నిద్రలేచి టిఫిన్ చేసి వెళ్లారు. మధ్యాహ్నం హోటల్‌లో డ్యూటీకి రావాల్సిన ఇద్దరూ రాకపోవడంతో హోటల్ యాజమాన్యం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో వారి గదికి వెళ్లి చూస్తే ఝాన్సీ విగతజీవిగా మంచంలో పడి ఉంది. బన్నీ గదిలో లేదు. దీంతో హోటల్ నిర్వహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివతేజ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న బన్నీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఝాన్సీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ఎస్ఐ శివతేజ తెలిపారు. బన్నీ సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా నల్లగొండలో పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం.

ట్రాక్టర్ ట్రాలీలో ధాన్యం అన్‌లోడ్ చేస్తుండగా..

● ట్రాలీకి విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి



ట్రాలీకి తగిలిన విద్యుత్ తీగలు



సైదులు (ఫైల్)

మునగాల నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న ధాన్యం ఐకేపీ కేంద్రంలో అన్‌లోడ్ చేస్తుండగా ట్రాలీ విద్యుత్ తీగలకు తగిలి రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తాడ్వా యి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి గ్రామానికి చెందిన చిర్రా సైదులు(58) పండించిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని తాడ్వాయి నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో కలకోవ రోడ్డు సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధ్యాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లాడు. ట్రాక్టర్‌లో ఉన్న ధాన్యం అన్‌లోడ్ చేసేందుకు ట్రాలీ హైడ్రాలిక్‌ను ఎత్తి కిందికి దిగాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ నూటల్‌గా ఉండి ముందుకు వెళ్లడంతో పైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగల్ హైడ్రాలిక్‌తో ఉన్న ఇనుప పైపులకు తాకాయి. వెంటనే ట్రాక్టర్‌ను ఆపేందుకు వెళ్లడంతో సైదులు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సైదులు భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి..




శాలిగౌరారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొలంలో గేదెలు మేపుతుండగా ప్రమాదవశాత్తు తెగిపోయిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతిచెం దాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని బైరవునిబండలో మంగళవారం జరి గింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బైరవునిబండ గ్రామానికి చెందిన మణికొండ యాదయ్య(58) కూలి పనిచేస్తూ జీవనం కొనసా గిస్తున్నాడు. గ్రా మానికి చెందిన పులిగిళ్ల గంగయ్య అనే రైతు వ్యక్తిగత పనుల మీద వేరే గ్రామానికి వెళ్తూ తన గేదెలను మేపుకొని వస్తే కూలీ ఇస్తానని మ ణికొండ యాదయ్యకు గంగయ్య చెప్పాడు. గంగయ్య గేదెలను తో లుకొని యాదయ్య గ్రామ శివారులోని పొలం మేపుతుండగా అప్పటికే తెగిపడిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు యాదయ్యకు తాకడం అక్కడికక్కడే మృతిచెందాడు. యాదయ్య కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మోతె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని మామిళ్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులతో అసభ్యంగా ప్రవర్తినస్తున్న ఉపాధ్యాయుడిని డీఈవో అశోక్ సస్పెండ్ చేశారు. డీఈవో అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉమెన్ డెవలప్‌మెంట్ చైల్డ్ వెల్ఫేర్, మహిళా శిశుసంక్షేమ ఆధ్వర్యంలో మహిళల రక్షణపై మామిళ్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8వ తేదీన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాసరెడ్డి తమతో కొన్ని నెలలుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తొమ్మిది, పదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడిపై హెచ్‌ఎం రామనర్సయ్యకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అధికారులకు తెలిపారు. ఈ అంశాన్ని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ నిర్వహించాలని డీఈవో అశోక్‌ను కలెక్టర్ ఆదేశించారు. సదరు ఉపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని డీఈవో విచారణలో తేలడంతో, ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డిని డీఈవో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న ఔషధాలు సీజ్



అధికారులు సీజ్ చేసిన ఔషధాలు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామంలోని మెడికల్ దుకాణంలో లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న 31 రకాల నిషేదిత ఔషధాలను జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ మంగళవారం సీజ్ చేశారు. దేశ్‌ముఖిలోని ఆకుల గోపీనాథ్‌కు చెందిన లైసెన్స్ లేని ప్రాంగణంలో నిల్వ చేసిన 31 రకాల ఔషధాలను సీజ్ చేసి, సదరు వ్యక్తిపై డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన మందులను చౌటుప్పల్ జెఎఫ్‌సీఎం కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు. సుమారు రూ. 40వేల విలువైన మందులను సీజ్ చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని లారీలో తరలించడానికి సిద్ధం చేస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామానిక చెందిన పంతాంగి రాజు, వృత్తిరీత్యా వ్యాపారస్తుడు ఆ గ్రామపరిధిలో శ్రీ వీరాంజనేయ బిన్ని రైస్ మిల్లును నిర్వహిస్తున్నాడు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, ప్లాస్టిక్ బస్తాల్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. సుమారుగా 240 బస్తాలను లారీలో లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆలేరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ రజినికర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నడికుడి మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన టిట రామకృష్ణ(26) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసముంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఆలేరు బైపాస్ మార్గంలో ఉన్న మెడిస్ హోటల్ వద్దకు రాగానే డివైడర్‌ను ఢీ కొనడంతో వాహనం పల్టీ కొట్టింది. ప్రమాదంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. రామకృష్ణ అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత

మేళ్లచెరువు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 20 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని పులిచింతల ప్రాజెక్టు కాలనీలో మంగళవారం జరిగింది. బాధితుడు ఆనంగి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెలను మేత కోసం సోమవారం ఉదయం తీసుకెళ్లాడు. సాయంత్రం ప్రాజెక్టు సమీపంలోని నెమలిపురి కాలనీలో ఉన్న కొట్టంలో గొర్రెలను వదిలాడు.

కుక్కలు రాత్రి గొర్రెలపై దాడి చేశాయని, మంగళవారం ఉదయం వెళ్లి చూడగా 20 గొర్రెలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. గొర్రెల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వెంకయ్య వేడుకున్నాడు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండీ,చెన్నై-600032. నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, ధానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో పేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేది: 22-11-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 1-8-301 ,మొదటి అంతస్తు, APSRTC బస్టాండ్ దగ్గర,హనుమకొండ రోడ్,భువనగిరి,యాదాద్రి భువనగిరి-508116 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
BHONGPJ2405020004	MADHU NAYAK BANOTHU	BHONGPJ2405300003	NARASIMHA GUGULOTH
BHONGPJ2405040002	RAKESH BITTU	BHONGPJ2405300002	NARASIMHA GUGULOTH
BHONGPJ2405070005	SHIVAKUMAR GUNUGUTLA	BHONGPJ2405310003	PREMALATHA DARGAYI
MTHKUPJ2405090015	ANWAR SHAIK	MTHKUPJ2406010013	CHANDRAIAH TEEGALA
BHONGPJ2405230002	NARSIHMA SHAGANTI	MTHKUPJ2405270011	NARESH CHENNEBOYINA
MTHKUPJ2405230001	VIJAY KUMAR SADULA		

వేలం తేది: 22-11-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 3-206/1 ,మొదటి అంతస్తు, ఎన్.హెచ్-9,చౌటుప్పల్,యాదాద్రి భువనగిరి-508252 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
VLIGNPJ2405070006	ANIL BANDELA	CHOPLPJ2405300002	PARAMESH MACHA
CHOPLPJ2405110002	SEELAM VAMSHIKRISHNA	CHOPLPJ2405310004	MALLESH PALEM
VLIGNPJ2402170005	SUGUNAMMA EERAPAKA	VLIGNPJ2405290004	MANTHRI NAGESH

వేలం తేది: 22-11-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 17-7/1 ,క్లాత్ మర్చాంట్‌సాస్ బిల్డింగ్ MM కోర్టు దగ్గర,దేవరకొండ-508248 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
DEVKDPJ2405160003	OLIYA BEE	DEVKDPJ2405300001	MADHU MADDIMADUGU
DEVKDPJ2405230005	KIRANKUMAR PAGIDIMARRI	DEVKDPJ2405310004	BIKAN SINGH MUDAVATH
DEVKDPJ2405230001	SAIDULU VANGURI	DEVKDPJ2405310005	BIKAN SINGH MUDAVATH
DEVKDPJ2405240004	NENAVATH KEECHYA	DEVKDPJ2405310006	BIKKAN SINGH MUDHAVATH
DEVKDPJ2405250010	RAMAVATH VARUN	DEVKDPJ2405310003	BIKAN SINGH MUDAVATH

వేలం తేది: 22-11-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 14-156,లింగగిరి రోడ్,ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా,హుజూర్‌నగర్-508204 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
HUZRNPJ2405020003	HUSSAIN BANOTHU	HUZRNPJ2405160001	USHA PALLE
HUZRNPJ2405020006	CHANDU PIDAMARTHI	HUZRNPJ2405180004	VEERASWAMI YARAGANI
HUZRNPJ2405030002	NARASIMHA CHARY AKKENAPALLI	HUZRNPJ2405180002	RAJESH MULKALAPALLI
HUZRNPJ2405030003	VASANTHA AKKENAPALLI	HUZRNPJ2405200003	BUJJI GUGULOTHU
HUZRNPJ2405070007	JYOTHI BHUKYA	HUZRNPJ2405200002	LAXMI BHUKYA
HUZRNPJ2405080001	VENKANNA BATHULA	HUZRNPJ2402200013	SAIDAMMA DUGGI
HUZRNPJ2405080002	NAGASAIDULU KARINGULA	HUZRNPJ2402200007	NAGALAXMI CHIMATA
HUZRNPJ2405090009	GOVINDU DHARAVATH	HUZRNPJ2405220007	NAGUL MEERA SHAIK
HUZRNPJ2405090005	RAMJI BANOTHU	HUZRNPJ2405220004	VENKATAREDDY CHANDA
HUZRNPJ2405110003	RAVINDRA BABU KOLIKAPOGU	HUZRNPJ2405230007	NARESH BOORA
HUZRNPJ2405110002	JYOTHI KASTHALA	HUZRNPJ2405230006	GOPI NANDIGAMA
HUZRNPJ2405140004	JAKKAMPUDI VINAYKUMAR	HUZRNPJ2405240005	MAMATHA BHUKYA
HUZRNPJ2405150002	RAVINDER REDDY ABBIREDDY	HUZRNPJ2405240006	HANUMA AZMIRA
HUZRNPJ2405150011	MOSHAIAH MEESALA	HUZRNPJ2405240004	SAIDULU BHUKYA
HUZRNPJ2405150010	SUDARSHANAM ANJANAPALLI	HUZRNPJ2405310001	NARASIMHA CHARY AKKENAPALLI
HUZRNPJ2402160003	RAVI BHUKYA	HUZRNPJ2405290005	SUDHAKAR THALAKAPPALA
		HUZRNPJ2402290005	RAVI BANOTHU
		HUZRNPJ2405290009	SAIDAIAH MEESALA

వేలం తేది: 22-11-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 12-10707, BLOCK NO 12, ANU TOWERS, SURYAPET ROAD,KODAD,508206 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
KODADPJ2405090003	LINGAIAH KUNTIGORLA	KODADPJ2405160002	BODA LOVATHALI

వేలం తేది: 22-11-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 5-4-87,88,రెండవ అంతస్తు,హరిదీప్ సిల్క్స్ ప్రక్కన,ప్రకాశం బజార్,నల్గొండ -508001 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
NAKRLPJ2405040002	SANTHOSHA CHILUKA	NAKRLPJ2405180004	SATHYANARAYANA BHUPATHI
NAKRLPJ2405040004	DEVARAKONDA SRINIVASULU	NAKRLPJ2405180010	SHIVARATHRI LAKSHMI
NLGD2PJ2405040001	SRIKANTH GUNDEBOINA	NLGNDPJ2405180001	BHASKAR CHINNALA
NAKRLPJ2405070002	SUDHAKAR NARSING	NAKRLPJ2402190004	BALASWAMY DURGAM
NAKRLPJ2402070005	YEKULA GANESH	NAKRLPJ2405230011	SHAILAJA NARAGONI
NAKRLPJ2405080006	ADLA VENKANNA	NLGNDPJ2405230010	GADAGOJU NARSIMHA CHARY
NAKRLPJ2405080003	LAXMI NARAYANA CHOUGONI	NLGNDPJ2405240005	SHANKARAMMA PAGIDIMARRI
NAKRLPJ2402090008	SHANKAR GOGULA	NLGNDPJ2405250001	RAMACHARY KOPPOJU
NLGNDPJ2405090014	AJITH KASH MADDIMADUGU	NLGD2PJ2405300001	RAMACHARY KOPPOJU
NAKRLPJ2405090002	LAXMI NARAYANA CHOUGONI	NAKRLPJ2405300002	SUDHAKAR MANDA
NLGNDPJ2405090007	SRIDHAR TULLA	NAKRLPJ2405310004	NAGARAJU CHETTIPALLY
NAKRLPJ2405100005	RAVI DARINGULA	NAKRLPJ2405310003	VENKATESH ALAKUNTLA
NAKRLPJ2405100004	VASANTHA DERINGULA	NAKRLPJ2405310006	RAMESH INDRAKANTI
NLGNDPJ2405110001	VALIKI MAHESH	NLGNDPJ2405310004	SANDEEP NALPARAJU
NAKRLPJ2405140006	SATHYAM SAMPANGI	NAKRLPJ2405310010	YADAGIRI PULAKARAM
NAKRLPJ2402140003	KUMAR GADDAGUTI	NLGD2PJ2405310004	NAVEEN REDDY JULAKANTI
NAKRLPJ2405150006	SATHAIAH SIRIPANGI	NAKRLPJ2403010002	YELLAIAH PALADUGU
NAKRLPJ2405160002	BONTHA VENKANNA	NLGNDPJ2406010002	BURRA GANGA RAJU
NAKRLPJ2405160001	BONTHA PADMA	NLGNDPJ2405270006	SHANKARAMMA AGIDIMARRI
NAKRLPJ2405170011	MOUNIKA SHIVARATHRI	NAKRLPJ2405270009	PICHAIAH ANTHATI
NAKRLPJ2405170005	SUDHAKAR NARSING	NAKRLPJ2405290009	JANAIAH BODA
NAKRLPJ2405160005	ADLA RAMULU		
NAKRLPJ2405160013	NAKIREKANTI PURUSHOTHAM		
NAKRLPJ2405160011	RAPARTHI RANI		

వేలం తేది: 22-11-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 1-4-249,మొదటి అంతస్తు,కూడా రోడ్,కొత్త బస్టాండ్ దగ్గర,సూర్యపేట,సూర్యపేట జిల్లా -508213 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
SRYPTPJ2405020003	GANESH KARINGULA	SRYPTPJ2405220002	VENKANNA CHINTHA
SRYPTPJ2405070004	MALSOOR KOKKIRENI	SRYPTPJ2405250002	MADHUSUDHAN CHINTHA
SRYPTPJ2405090003	RAVI DHARAVATHU	SRYPTPJ2405310006	CHANDRA SHEKAR KODATI
SRYPTPJ2402150004	SANDEEP KUNCHAM	SRYPTPJ2406010004	NARESH VEMULA
SRYPTPJ2405160002	KIRAN DESHAGANI	SRYPTPJ2406010002	SATHEESH KANUKU
SRYPTPJ2405180002	SAIDAMMA YERPULA	TSURYPJ2405300003	JANI PIDAMARTHI
SRYPTPJ2405210001	BHAVANI DONAPUDI	SRYPTPJ2405270002	VIJAY BHUPATHI

వేలం తేది: 23-11-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 19-862 , గ్రౌండ్ ఫ్లోర్,హనుమాన్‌పేట,సాగర్ రోడ్,మిర్యాలగూడ.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
MRLG2PJ2402050008	DHANANJAIAH GADHALA	MRLGDPJ2405070001	NARSIMHA METHARI
HALYAPJ2405070007	KANAKAMMA KUTALA	MRLGDPJ2405090005	SHEAIK JANIBEGAM
MRLG2PJ2405100002	PRAVEEN GINAKALA	MRLGDPJ2405100002	DHANAVATH THULASIRAM
MRLG2PJ2405100004	SHEAIK JANIBEGAM	MRLGDPJ2405100003	RAMULU GAMALLA
HALYAPJ2405170003	KOTACHARI DEVULAPALLI	MRLGDPJ2405140006	BHARATHI MADIRI
HALYAPJ2405180001	KOTAMMA SHILAM	MRLGDPJ2405150003	SWAPNA INDRAPALLI
HALYAPJ2405180002	SRINU SALLA	MRLGDPJ2405170012	SAIDULU MUDI
HALYAPJ2405200003	SHANKAR	MRLGDPJ2405180002	KRISHNA CHARY PAGADOJU
HALYAPJ2405220003	NAGESHWAR RAO GUMMADEELA	MRLGDPJ2405200003	GOPAIAH PANGA
MRLG2PJ2405230001	MANCHIKANTI RAMREDDY	MRLGDPJ2405210003	BALASWAMY SINGAM
HALYAPJ2405230003	KISHAN RAMAVATH	MRLGDPJ2405220008	AVURADHI JHANSI
HALYAPJ2405230007	SAIDULU TANACHINTALA	MRLGDPJ2405240001	KAVITHA BADE
HALYAPJ2405240004	SAI POLEPALLI	MRLGDPJ2405250005	KUNCHAM PUSHPA
HALYAPJ2402240005	SYLAJA KONDAPALLI	MRLGDPJ2403010014	LAXMAMMA KUNCHAM
MRLG2PJ2405250010	CHIKKULA NAGALAXMI	MRLGDPJ2406010004	RENUKA NIRUDU
MRLGDPJ2405280001	KOTAIAH BALUGURI	MRLG2PJ2405270001	NAGA MALOTHU
MRLGDPJ2405290004	SULTHANABEGUM SHAIK	MRLG2PJ2405280003	VEMULA MARAIAH
HALYAPJ2403010002	RAMALINGAIAH PALLEBOINA	MRLG2PJ2405280007	SRILAKSHMI SASANALA
MRLG2PJ2403010002	YALLAMMA VEMULA	MRLG2PJ2405290005	KALE SRAVANKUMAR

వేలం తేది: 26-11-2024 వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం. 1-8-588, 3 వ అంతస్తు, వైష్ణవి హీరోహోండా షోరూంపైన,నక్కలగుట్ట,హనుమకొండ .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
ALERPJ2405030004	SIDDULU DODDI	TRMLGPJ2405170001	CHERUKU PRAVALATHA
ALERPJ2405040011	KAMMAMPALLY SATHISH KUMA	ALERPJ2405170008	SIDDULU DODDI
TRMLGPJ2405080001	GADARABOYENA VEERAIAH	ALERPJ2405170012	SUDHAKAR ARE
ALERPJ2405090005	GYARA NAVEEN	TRMLGPJ2402170001	UPENDAR PERALA
ALERPJ2405090003	SHARATH KUMAR MUDDEPAKA	ALERPJ2405200002	KRISHNA MALLAM
ALERPJ2405090012	ARUNKUMAR PONNAGANI	ALERPJ2402210004	TANTARAPALLI BALAKRISHNA
ALERPJ2405100009	SAGAR SIRIGIRI	ALERPJ2405220003	KAMMAMPALLY SATHISH KUMA
ALERPJ2405100005	ANJAIAH MANTHAPURI	ALERPJ2405220002	KAMMAMPALLY SATHISH KUMA
TRMLGPJ2405100007	NANUBOTHU MAHESH	ALERPJ2405230001	KAMMAMPALLY SATHISH KUMA
TRMLGPJ2402100004	PARASURAMULU MADA	ALERPJ2405230004	VENKATAIAH PILLUTLA
ALERPJ2405110005	SAGAR SIRIGIRI	ALERPJ2405250008	PARAMESHWARI KOTHA
ALERPJ2405110003	SAGAR SIRIGIRI	ALERPJ2405250001	RAMULU GANDLA
ALERPJ2405110004	SAGAR SIRIGIRI	ALERPJ2405250009	PARAMESHWARI KOTHA
ALERPJ2405140005	SAGAR SIRIGIRI	TRMLGPJ2402260006	BHADRAIAH PULIPAMPULA
ALERPJ2405140001	SHIVAKUMAR CHINTHAKINDI	TRMLGPJ2405300001	GUGULOTHU NARSIMHA
ALERPJ2405140006	KARNAKAR GODISHELA	ALERPJ2405300003	MORIGADI BHAGYAMMA GOUD
ALERPJ2405150008	INJA RUTHWIK	ALERPJ2405310002	MORIGADI BHAGYAMMA GOUD
ALERPJ2405150003	SHARATH KUMAR MUDDEPAKA	ALERPJ2405270013	KAMALA KANDULA
ALERPJ2405160003	GANGESH NANDA	ALERPJ2405270014	KANDULA VENU
ALERPJ2405160004	GANGESH NANDA	ALERPJ2405280002	VAMSINADH VANGALA
ALERPJ2405160002	GANGESH NANDA	ALERPJ2405280006	GOLLURI SRIKANTH
ALERPJ2405160001	GANGESH NANDA	ALERPJ2405290007	SURESH MADIPALLY
ALERPJ2405160007	CHOLLETI BALANARSAIAH		
TRMLGPJ2405170002	CHERUKU KIRAN		
ALERPJ2405170011	SUDHAKAR ARE		

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ టి.పురుషోత్తమ్ ఏరియా హెడ్‌ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 13.11.2024 సం/- అధీకృత అధికారి

స్థలం: మిర్యాలగూడ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

తాటిచెట్ల కూల్చివేత

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన పిట్ట శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం కల్లు గీసే తాటి చెట్లను అక్రమంగా కూల్చివేశారని గౌడ సంఘం అధ్యక్షుడు పాలకుర్ల కుమార్ గౌడ్ తెలిపారు. తాటి చెట్లను కూలుస్తున్న రైతు వద్దకు వెళ్లి అడిగితే అతడు దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు పై అధికారులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పాలకుర్ల కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు బైరు జంగయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, నర్సింహగౌడ్, కప్పల అంజయ్యగౌడ్ ఉన్నారు.

కంఠమహేశ్వరుడి కల్యాణానికి మంత్రికి ఆహ్వానం

చౌటుప్పల్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే కంఠమహేశ్వర స్వామి కల్యాణోత్సవాల ఆహ్వాన పత్రికలను మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి గౌడ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ ఇంచార్జ్ పబ్బు రాజు, చౌటుప్పల్ పట్టణ ఇంచార్జ్ మొగుదాల రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, మాజీ వార్డు సభ్యుడు బత్తుల విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

మూసీ దీపోత్సవాన్ని విజయవంతం చేయాలి

రామన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఈనెల 14న సాయంత్రం 4 గంటలకు నిర్వహించే మూసీ కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సామాజిక కార్యకర్త వేముల సైదులు అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రకృతిని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

గుట్ట బస్టాండ్‌లోకి రాని బస్సులు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 12: నిబంధనల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్‌లోకి రావాల్సి బస్సులు రోడ్డు బయటే ఆగివెళ్లడంతో ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. యాదగిరిగుట్ట ప్రధాన బస్టాండ్‌లోకి బస్సులను తీసుకవచ్చి ఆపాల్సిన నిబంధనలను డ్రైవర్లు, కండక్టర్లు తుంగలోతొక్కుతున్నా సంబంధిత అధికారులు స్పందించడంలేదనే విమర్శలు ఉన్నాయి. బస్టాండ్‌కు బయటే ఆగి వెళ్లడంతో బస్సులకోసం వేచి ఉన్న ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. బస్టాండ్‌ను నమ్ముకుని జీవిస్తున్న చిరువ్యాపారులు తమ వ్యాపారాలు చితికిలబడి కుటుంబ భారాన్ని మోయలేక ఇబ్బంది పడుతున్నారు.

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి నిత్యం సామాన్య భక్తులు, ప్రయాణికులు రాష్ట్రం నలుమూలల నుంచి పలు ఆర్టీసీ బస్సుల్లో స్థానిక బస్టాండ్‌కు రావల్సి ఉంది. దీనికి విరుద్ధంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను బస్టాండ్‌లోకి తీసుకురాకుండా బస్టాండ్ బయటే నిలిపివేస్తున్నారు. దీంతో రోడ్డు ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో పాటు బస్సుల్లో వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



యాదగిరిగుట్ట బస్‌స్టేషన్

కొండపైకి వెళ్లాలంటే గుట్ట బస్టాండ్‌లో దిగాలా లేక గుట్టపైకి వెళ్లే దేవస్థానం బస్టాండ్‌లో దిగాలా అనే సందేహం ఏర్పడుతోంది. ఒకవేళ దేవస్థానం బస్టాండ్‌లో దిగితే బసచేయడానికి అక్కడ వసతుల గదులు ఏమాత్రం లేవు. భక్తులకు కష్టాలు తప్పడం లేదు. పాతబస్టాండ్‌లోనే దిగితే ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు ఉంటాయి. దీనికి విరుద్ధంగా ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు తమ ఇష్టారాజ్యం ఏకంగా బస్టాండ్‌కు బైయటే బస్సులను నిలిపి, వెళుతున్నారు. పాతబస్టాండ్ ప్రాంతంలో 50 సంవత్సరాల నుంచి బస్టాండ్‌ను నమ్ముకుని వందల కుటుంబాలు అనేక రకాల వ్యాపారాలు చేసుకుంటూ తమ తమ కుటుంబాలను పోషించుకుంటున్నాయి. ప్రయాణికులు బస్టాండ్‌లోపలికి రాకపోవడంతో వ్యాపారులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

డ్రైవర్లు, కండక్టర్ల నిర్లక్ష్యం



రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను తీసుకవచ్చిన డ్రైవర్లు, కండక్టర్లు నిర్లక్ష్యంగా బస్సులను బస్టాండ్ లోపలికి తీసుకువెళ్లకుడా బస్టాండ్‌కు బయటే నిలుపుతున్నారు. పాతబస్టాండ్‌లో దిగాలా? దేవస్థానం బస్టాండ్‌లో దిగాలా? అని ప్రయాణికులు తికమక పడుతున్నారు. డ్రైవర్లు బస్సులను బస్టాండ్‌లోకి తీసుకువెళితే సమస్య ఉత్పన్న కాదు.

-కళ్లెం కృష్ణ, యాదగిరిగుట్ట

పాత బస్టాండ్‌లోకి బస్సులను తీసుకెళ్లాలి



శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను తీసుకవస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను పాతబస్టాండ్‌లోకి తీసుకువెళ్లాలి. యాదగిరిగుట్ట దేవస్థానం బస్టాండ్ ప్రారంభించిన నాటి నుంచి బస్టాండ్‌లోకి బస్సులను డ్రైవర్లు తీసుకవెళ్లడం లేదు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-కర్రె ప్రవీణ్, యాదగిరిగుట్ట

బస్టాండ్‌లోకి బస్సులు రావడంలేదు



ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌కు రాకుండా, బైటకు వెళ్లకుండ రోడ్డుకు అడ్డంగా ఉండటంతోనే బస్సులను బస్టాండ్‌లోకి తీసుకరాలేకపోతున్నాం. ఆటోల సమస్యపై స్థానిక ట్రాఫిక్ సీఐ దృష్టికి తీసుకువెళ్లి, వాటిని నివారించి బస్సులను బస్టాండ్‌లోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాస్‌గౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్, యాదగిరిగుట్ట

వంగపల్లికి ఆర్టీసీ బస్సులు నడపాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న వంగపల్లి గ్రామస్థులు

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి మండలంలోని వంగపల్లి వద్ద వంగపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సులు రావాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మోటకొండూర్‌కు వెళ్లే రహదారివద్ద అండర్‌పాస్ బ్రిడ్జి పనులు చేపట్టడంతో, అధికారులు, సబంధిత కాంట్రాక్టర్లు కలిసి వంగపల్లికి గ్రామానికి యూటర్న్ చేయకుండా డివైడర్లు ఏర్పాటు చేయడంతో గ్రామానికి బస్సులు రాకపోడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే జాతీయ రహదారిపై దింపివెళ్లడం, విద్యార్థులు కళశాలకు వెళ్లాలంటే ఎక్కువ దూరం నడవలేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గతంలో మాదిరిగా గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సుల ను నడపాలని డిమాండ్ చేశారు. స్థానిక సీఐ రమేష్ సర్ధిచెప్పి గుట్ట డిపో నుంచి వంగపల్లి మీదుగా బస్సులు వెళ్లే విధంగా డీఎంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అఖిల పక్ష నాయకులు మాజీ సర్పంచ్ చంద్రగాని జహంగీర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రేపాక స్వామి, రేపాక మహేందర్, బీజేపీ నాయకుడు కొట్టూరు శివశంకర్, అచ్చిన కృష్ణస్వామి, సీస వెంకటేష్ గౌడ్, ఎండి.అజ్జూ, కానుగు అనిల్‌గౌడ్, బొట్టు రాజు, సాదవెళ్లి రాజశేఖర్, గుండ్లపల్లి ఆదర్శ్‌గౌడ్, అనిల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు గుట్టలో టీడీపీ సభ్యత్వ నమోదు

యాదగిరిగుట్ట రూరల్, నవబంరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మశాలి భవనంలో ఈ నెల 14న ఆలేరు నియోజకవర్గం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ రేగు బాలనర్సయ్య తెలిపారు. మంగళవారం గుట్టలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, జాతీయ అధికార ప్రతినిధి తిరుమల తిరుపతి పాలకమండలి సభ్యుడు నన్నూరు నర్సిరెడ్డి హాజరువుతారని చెప్పారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆయనతో పాటుగా నాయకులు మచ్చ నర్సింహ్మగౌడ్, బాబురావుగౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆలేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శారాజీపేట 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు బుధవారం చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేష్ కోరారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మర్మతు పనులు జరుగుతాయని తెలిపారు.

16 నుంచి మండల పూజా మహోత్సవాలు

భువనగిరి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భువనగిరి శబరి నగర్‌లోని శ్రీ హరి హరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు 19వ మండల పూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయన కమిటీ చైర్మన్ అయిత రాములు తెలిపారు. మంగళవారం ఆలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 రోజుల పాటు ఆలయంలో పడి పూజ, అభిషేక, హోమ పూజలు,, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొనుగోళ్లు వేగంగా..

5వ పేజీ తరువాయి: తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. ధాన్యాన్ని క్వింటాకు రూ.1,900 నుంచి రూ.2,005 వరకు రైతులు విక్రయించారు. భువనగిరి, ఆలేరు, గుండాల, తదితర మండలాల్లో చాలా మంది రైతులు వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయించారు. రైతులు లేకపోవడంతో పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను అధికారులు మూసివేశారు. కాగా, జిల్లాలో 47 కేంద్రాలను సన్న రకాల ధాన్యం కొనుగోలుచేసేందుకు ఏర్పాటుచేయగా, అయినా రైతులు సన్న ధాన్యాన్ని వ్యాపారులకే విక్రయిస్తున్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నాం



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నాం. నాలుగైదు రోజులుగా కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతులు తెచ్చిన ధాన్యంలో తేమ శాతం తగ్గిన తర్వాత కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నెలాఖరులోగా 2లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తాం. ఇప్పటివరకు ధాన్యం విక్రయించిన రైతులకు రూ.30కోట్ల మేర చెల్లింపులు చేశాం.

-జగదీశ్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్

దిమ్మెను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



భువనగిరిలో నిరసన తెలుపుతున్న కుమ్మరి సంఘం నాయకులు

భువనగిరి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియాలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం నిర్మించిన దిమ్మెను తొలగించిన మునిసిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కుమ్మరి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం భువనగిరి కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో స్థానిక కుండల బజార్‌లో నిరసన తెలిపారు. మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కొద్ది సేపు రహదారిపై ఆందోళన నిర్వహించారు. మునిసిపల్ అధికారులే దిమ్మెను పునర్మించాలని అన్నారు. కుమ్మరి సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తాడూరి అంజయ్య, తాడూరి బాలశంకర్, కోశాధికారి తాడూరి కుమార్, మాజీ కౌన్సిలర్ తాడూరి బిక్షపతి, చినగారి బాల సత్తయ్య పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



కిషన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌసుకొండ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినందుకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ రైతులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేశారు. దీంతో రైతులు హర్షిస్తూ రైతుల కష్టాలను తీర్చేందుకు కృషి చేసిన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకంచేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా నాయకులు మేకల చొక్కారెడ్డి, నాయకులు దోసపాటి అంజయ్య పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూదాన్‌పోచంపల్లికి చెందిన బోగ చంద్రశేఖర్‌ను మంగళవారం నిర్వహించిన ఎన్నికల కార్యక్రమంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని రాష్ట్ర కోశాధికారి మాధవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బోగ చంద్రశేఖర్ మాట్లాడుతూ తనకిచ్చిన ఈ బాధ్యతను శిరసావహించి శక్తి వంచన లేకుండా ఫొటో, వీడియో గ్రాఫర్ల కష్ట సుఖాల్లో పాలుపంచుకుని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల కమిటీ నాయకులు యామల రెడ్డి బొమ్మగాని గణేష్‌నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడిగా బోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా చిల్లా హరిరెడ్డి, కోశాధికారిగా తునికి దశరథ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపాల శారద, చిలువేరు ప్రవీణ్, ఏపాల కృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

వాగును ఆక్రమించిన వ్యక్తులపై కేసు నమోదు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాగును ఆక్రమించిన వ్యక్తులపై కేసు నమోదు అయింది. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సైదాపురం గ్రామానికి చెందిన కనుకుల సిద్దారెడ్డి, మల్లాపురం గ్రామానికి చెందిన సిద్దులు మల్లాపురం సమీపంలో ఉన్న వాగు ఆక్రమణకు పాల్పడుతున్నారని ఇరిగేషన్ ఏఈఈ తరుణ్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శాస్త్రోక్తంగా మత్స్యగిరీశుడి బ్రహ్మోత్సవాలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం గుట్టపైన మంగళవారం స్వామివారి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. అర్చకుల పారాయణాలు, హోమాలు, చతుస్థానార్చన, బలి ప్రదానం, శాత్తు మొర, ఉత్సవమూర్తుల స్నపనం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నరసింహుడి కల్యాణం సందర్భంగా శ్రీ మత్ భాగవతం, రామాయణం, పంచసూక్త పారాయణాలు నిర్వహించారు. సుప్రభాత సేవలో స్వామిని మేల్కొలిపిన అర్చనలు, ఆరాధనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు వేద మంత్రాలతో చతుస్థానార్చన చేశారు.

బలిహరణం

దుష్ట శక్తులు ఆలయ ప్రాంగణంలో సంచరించకుండా నిరోధించేందుకు యజ్ఞీకులు బలిహరణం నిర్వహించారు. ముక్కోటి దేవతలకు సప్త స్వరాలు, మృదంగ నాధాలతో భేరీ పూజ జరిపి, బలి హరణం నిర్వహించారు. త్సవమూర్తులకు 25 కలశాలలో పంచామృతాలతో శంఖధార, చక్రధార మంగళస్నానం నిర్వహించారు.

నేడు లక్ష్మీనృసింహుడి కల్యాణం

మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 11గంటలకు స్వామివారి కలాణమహోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణ తంతును తిలకించడానికి హాజరయ్యే భక్తులకు దేవస్థాన అధికారులు, పాలక మండలి అన్ని వసతులను ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తమండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, ఈవో మోహన్‌బాబు, ధర్మకర్తలు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కలాపాల నివారణపై నిఘా పెంచాలి



దాచారంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.నర్సింహారావు

మోత్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామంలో అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆవరణల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా పోలీసులు, గ్రామస్థులు నిఘా పెట్టాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి నర్సింహారావు అన్నారు. మందుబాబులు అంగన్‌వాడి పాఠశాల ముందు మందుతాగి, బీరు సీసాలు పగులగొట్టడంతో గాజు పెంకులు గుచ్చుకుని చిన్నారులు గాయపడుతుంటాన్ని 'మా పాఠశాల ముందు మందు తాగొద్దు' అన్న శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి స్పందించిన ఆయన స్థానిక అధికారులతో కలిసి అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాఠశాలల ఆవరణల్లో మద్యం తాగినా, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామంలో దండోరా వేయించాలని గ్రామ ప్రత్యేక అధికార మోతీలాల్‌కు సూచించారు. తహసీల్దార్ డి.రాంప్రసాద్, మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య, గ్రామ పత్యేక అధికారి మోతీలాల్, సీడీపీవో జ్యోత్స్న, ఆర్ఐ సుమన్, అంగన్‌వాడి టీచర్ నర్మద, వాచ్‌ఎంలు ప్రేమలత, వీరయ్య ఉన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకూ ఉద్యమాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్

చౌటుప్పల్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేసేంత వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం జిల్లా స్థాయి ఏఐటీయుసీ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులు మోదీ సర్కార్ కబంద హస్తాలలో చిక్కుకున్నాయని ఆయన విమర్శించారు. పాలక వర్గాలు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారి పోయాయని ఆయన అన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు సంఘటితమై తమ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, నాయకులు ఎస్. బాలరాజ్, ఎం. నర్సింహ్మ, యానాల దామోదర్ రెడ్డి కె.శ్రీనివాస్, బి. గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, పిల్లి శంకరయ్య, ఎండి. ఇమ్రాన్ లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రైతులు ఆందోళన చెందవద్దు.. రామన్నపేట: రామన్నపేట మండలంలోని పల్లివాడ, ఇంద్రపాలనగరం, సిరిపురం గ్రామాల్లో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం చైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి, రామన్నపేట తహసిల్దార్ లాల్‌బహదూర్‌తో కలిసి పరిశీలించారు. రైతులు తేమ లేని ధాన్యాన్ని సెంటర్లోకి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు.

దివీస్ సేవలు అభినందనీయం.. చౌటుప్పల్ రూరల్: గ్రామాభివృద్ధికి దివీస్ అందచేస్తున్న చేయూత అభినందనీయమని జై కేసారం గ్రామ ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. దివీస్ ల్యాబొరేటరి లిమిటెడ్ ఆధ్వర్యంలో జై కేసారంలో రూ.11లక్షల75వేల వ్యయంతో నిర్మించనున్న ఆర్వో ప్లాంట్, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పంచాయతీ కార్యదర్శి సరిత, దివీస్ అధికారులు గోపి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ.. వలిగొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూకట్‌పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ బత్తిని వెంకటేశం సౌజన్యంతో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యయులు ఆలకుంట్ల శ్రీనివాస్ నాయకులు బాలశెట్టి, ధనుంజయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిరపాలన.. వలిగొండ: దేశంలో సుస్థిరపాలన బీజేపీతోనే సాధ్యమని బీజేపీ సంఘటన పర్వ్ ఇన్‌చార్జి పట్నం కపిల్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యాయలంలో సంస్థా గత ఎన్నికలపైన వర్క్‌షాప్ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, జిల్లా కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, సభ్యత్వ ప్రముఖ రాచకొండ కృష్ణ, సీనియర్ నాయకులు బంధారపు లింగస్వామి, శ్రీలోజు శ్రీరాములు, దంతూరు సత్తయ్య బొడిగే ఆనంద్, లింగస్వామి పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిన నేతలు.. సంస్థాన్ నారాయణపురం: మునుగోడు మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి కురుమలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని దొడ్డి కొమురయ్య విగ్రహనికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యామ మల్లేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్‌లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు

నియామకం .. చౌటుప్పల్ రూరల్: రాహుల్, ప్రియాంక గాంధీ సేన ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షురాలిగా చిన్న కొండూరు గ్రామానికి చెందిన విజయలక్ష్మీసంతోష్‌గౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు సేన రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్ శర్మ నియామక పత్రాన్ని అందచేశారు.

అవార్డు రావడం అభినందనీయం..ఆలేరు: ఆలేరు పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త బండి రాజుల శంకర్ విద్యారంగంలో అందిస్తున్న సేవలను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ సంస్థ గుర్తించి ఆయనకు మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డు బహూకరించామని అఖిలక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం అన్నారు. మంగళవారం శంకర్‌ను శాలువాతో సన్మానించారు.

రైలు కిందపడి ఇద్దరి మృతి

బీబీనగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా మృతి చెందారు. బీబీనగర్-ఘట్కేసర్ రైల్వే మార్గంలో ఒకరు, బీబీనగర్ -పగిడిపల్లి స్టేషన్ల మార్గంలో మరొక వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. సుమారు 40సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి సోమవారం రాత్రి ఘట్కేసర్, బీబీనగర్ మార్గమధ్యలో 225/ 20-22 మైలు రాయి వద్ద దిగువ లైన్‌పై గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతిచెందాడు. ఒంటిపై గ్రీన్ కలర్ చొక్కా, నీలం రంగు బనియన్, కాఫీ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. కాగా సుమారు 30సంవత్సరాల వయసు గల మరో గుర్తు తెలియని వ్యక్తి బీబీనగర్- పగిడిపల్లి స్టేషన్లమార్గమధ్యలో 237/11-9 మైలు రాయి వద్ద ఎగువ లైన్‌పై రైలు కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలాలకు చేరుకుని మృత దేహాలకు పంచనామ నిర్వహించారు. ఆచూకీ తెలియకపోవడంతో భువనగిరి ఏరియా ఆసుపత్రిలోని మార్చురి గదిలో భద్రపరచామని ఆచూకీ తెలిసిన వారు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు మొబైల్ 9848222169, 8712568654 సంప్రదించాలని కోరారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి, వంగపల్లి, ఆలేరు మునిసిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వే తీరును ఆయన పర్యవేక్షించారు. సర్వే ఫారమ్‌లో కుటుంబాల వివరాల నమోదును క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



కొలనుపాకలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొలనుపాక, కొల్లూరు గ్రామాల్లో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన అకప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశం, తహసీల్దార్ అంజిరెడ్డి, వ్యవసాయ అధికారులు ఉన్నారు.


రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న కొలుపుల అమరేందర్

భువనగిరి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం రైతులను మోసగిస్తూ పాలన కొనసాగిస్తుందని జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ అన్నారు. మంగళవారం భువనగిరి మండలం చందుపట్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలుకేంద్రం వద్ద పేరుకుపోయిన ధాన్యం రాశులను ఆయన రైతులతో కలిసి పరిశీలించి నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రైతు రుణమాఫీ, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా అందజేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే కొనుగోలు చేపట్టాలని, లేదంటే సీఎం ఇంటిని రైతులతో కలిసి ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, రైతుబంధు మాజీ మండల కన్వీనర్ కంచి మల్లయ్య, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

సైకిల్‌పై పోలీస్ పెట్రోలింగ్



సైకిల్‌పై వెళుతూ సమస్యలు తెలుసుకుంటున్న పోలీసులు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సీఐ మన్మదకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించారు. తంగెడపల్లి రోడ్డు , చిన్నకొండూరు, వలిగొండ బస్‌స్టేషన్ ప్రాంతాల్లో సైకిల్‌పై తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు పోలీసులు చేరువగా ఉండడానికి సైకిల్‌పై పెట్రోలింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ లక్ష్మయ్య, సిబ్బంది ఉన్నారు.

కళాశాల ఆవరణలో పూజల కలకలం

మోత్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పూజలు నిర్వహించిన ఆనవాళ్లు కనిపించడం పట్టణంలో కలకలం రేపింది. మంగళవారం ఉదయం కళాశాల గేటు లోపల బిల్డింగ్ వద్దకు వెళ్లే దారిలో కోడి తల, నిమ్మకాలు, పుసుపు, కుంకుమలు, పచ్చి మిరపకాయలు ఉన్నాయి. దాన్ని బట్టి అక్కడ ఏవో పూజలు చేసి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. ఎవరైనా ఆకతాయిలు చేశారా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.